# హమ్మయ్య! అయింది పెళ్ళి!

## పొత్తూరి విజయలక్ష్మి

*క్రోధన ఉగాది హాస్య కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ*

**మా సుబ్బారావంటే** చెప్పలేనంత జాలి మా అందరికీ. నిజానికి సుబ్బారావుని చూసిన వాళ్ళు అతణ్ణి చూసి జాలిపడరు సరికదా, అసూయపడతారు. అలా ఉంటాడు మా సుబ్బారావు. ఆజానుబాహువు. పచ్చని పసిమి రంగు. పోనీ, రూపం ఉండి చదువూ సంధ్యా లేవేమో అనుకునేందుకు వాడు పోస్ట్-గ్రాడ్యుయేట్. లెక్చరర్ ఉద్యోగం ఉంది. బోలెడంత ఆస్తి ఉంది. ఇక గుణగణాల మాటకొస్తే వాడికి వాడే సాటి. ఏ దురలవాట్లూ లేవు. మహా మంచివాడు. అతి అమాయకుడు. నోట్లో వేలు పెడితే కొరకలేడు. ఎవరేం చెప్పినా నమ్మేస్తాడు. వాడికి జీవితంలో పాపం, ఒకే ఒక్క కోరిక ఉంది. అదైనా అపురూపమైనదీ, అందుబాటులో లేనిదీ కాదు. చిన్నదే. అతి మామూలుదే. ఏమిటీ అంటే, ఘనంగా పెళ్ళి చేసుకుని, ఘనంగా రిసెప్షన్ ఇవ్వాలని. వాడికా కోరిక అంత బలీయంగా కలగడానికి బోలెడంత ఫ్లాష్ బాక్ ఉంది. ఏ ముహూర్తాన పుట్టాడోగానీ, వాడికి వేడుకలు అచ్చిరావు. పాపం!

చిన్నతనాన వాడు పుట్టగానే ముగ్గురాడపిల్లల తరువాత అపురూపంగా పుట్టిన పిల్లవాడు అని మురిసిపోయి నామకరణం భారీ ఎత్తున తలపెట్టారుట వాళ్ళవాళ్ళు. తీరా రేపు నామకరణం అనగా పిడిరాయిలా ఉన్న వాడి పితామహుడు బకెట్ తన్నేశాడుట. నానా గోలా అయిపోయి వీడి నామకరణానికి తెచ్చిన సరుకులు ఆయన దినవారాలకు వాడేశారుట. ఇక వీడికి నామకరణం చెయ్యలేదుట. ఆయన పేరే వీడికి పెట్టేశారుట.

నామకరణం ఎలాగూ లేదు. పోనీ అన్నప్రాశన ఘనంగా చేద్దాం అనుకున్నారుట. ఏర్పాట్లు ఘనంగా చేసి బంధుమిత్రులని ఆహ్వానించారుట. తీరా రెండ్రోజుల్లో వీడు అన్నం తింటాడనగా వాన మొదలై, గాలి తోడై తుఫానుగా మారిందిట. చెరువుకట్ట తెగి నీళ్ళ ఊళ్ళోకి వరదొచ్చేసిందిట. ప్రాణరక్షణార్థం ప్రజలంతా ఇళ్ళమీదికి ఎక్కారుట. వీడి అన్నప్రాశన ముహూర్తం సమయానికి వీడి బంధువులంతా అన్నం లేకుండా మలమల మాడుతూ ఇళ్ళమీద ఉండిపోవడం వల్ల, వీడికి అన్నం పెట్టడం కుదరలేదుట. నీళ్ళు తీసేసి కిందికి దిగివచ్చిన తరువాత ఆవురావురని వాళ్ళు తింటూ వీడికీ ఓ పిడచ నోట్లో పెట్టారుట.

'ఛ! ఎన్నిసార్లు వీడి వేడుక తల పెట్టినా ఏదో ఓ ప్రమాదం ముంచుకొస్తోంది' అని విసుక్కొని వాళ్ళ తండ్రిగారు అక్షరాభ్యాసానికి బ్రహ్మాండంగా ఏర్పాట్లు చేశారుట. ఫంక్షనుకి రెండు రోజుల ముందు ఊళ్ళో మత కలహాలు మొదలై క్రమంగా తీవ్రరూపం దాల్చటం వల్ల ఊళ్ళో కర్ఫ్యూ విధించేశారుట. ఇంట్లోంచి కదలడానికే వీల్లేకపోతే ఇంక స్కూలుకి వెళ్ళే ప్రసక్తి ఏది? అందువల్ల ఇంట్లోనే గుండు కొట్టించి 'ఓ న మః' దిద్దించేశారుట.

తరువాత కొంతకాలానికి వాడికి ఉపనయనం తలపెట్టి బితుకు బితుకుమంటూనే ప్రయత్నాలు చేశారుట. శుభలేఖలు వెళ్ళాయి. విజయవాడలోని వాళ్ళ సొంత ఇంటి ముందు పెద్ద పందిరి వేయించారు. లైట్లు, బాండు అన్నీ భారీఎత్తున అమర్చారుట. తెల్లారితే ఉపనయనం అనగా ఆ మధ్యాహ్నం నెహ్రూగారు మరణించారు. నేషనల్ మోర్నింగ్. ఏ శుభకార్యమూ చేయడానికి వీల్లేదు అని చెప్పి ఆ పందిరి పీకించేశారుట వాలంటీర్లు. ముహూర్తం మించిపోతే మళ్ళీ పెట్టించాలి...నానా చిరాకూ...ఎందుకులే? అసలు వీడి జాతకం ఇంతే అనుకుని ఏదో శాస్త్రార్థం క్లుప్తంగా వీడి మెడలో ఓ యజ్ఞోపవీతం పడేశారుట. ఇవన్నీ మాకు తెలియని విషయాలు. కాలేజీలో చేరాక, వాడికీ మాకూ స్నేహం కుదిరాక ఇవన్నీ చెప్పి 'ఏమిటోరా! ఒక్కొక్కడి జాతకం ఇంతే' అనేవాడు నిర్లిప్తంగా. మేమందరం 'నీ మొహంలే. ఏదో కాకతాళీయంగా జరిగింది. అంతమాత్రాన జాతకాలూ సింగినాదాలూ ఏమిట్రా!' అని తేలిగ్గా తీసిపారేసే వాళ్ళం. 'పోతే పోయిందిలే-అవన్నీ చిన్న చితకా వేడుకలు. వాటన్నింటీ వారా పెళ్ళి ఊరంతా దద్దరిల్లిపోయేలా చేసుకుందువుగానీలే' అని ధైర్యం చెప్పేవాళ్ళం. వాడి మొహం కళకళ్ళాడేది. చదువు పూర్తయింది. ఉద్యోగం వచ్చింది. భయం భయంగానే పెళ్ళి ఏర్పాట్లు మొదలుపెటారు వాడి పెద్దవాళ్ళు. చక్కటి సంబంధం చిటికెలో కుదిరింది. పెళ్ళిచూపులు చూసొచ్చాడు. ముహూర్తం నిశ్చయించారు. మరో నెల్లాళ్ళు ఉంది పెళ్ళి.

ఆ అమ్మాయికి ఉత్తరం రాస్తాను అన్నాడు. మహారాజులా రాయమన్నాం. ఎలా రాయాలో కాస్త సలహా చెప్పమన్నాడు. కనిపించిన ప్రతి ఆడపిల్లకూ ప్రేమలేఖలు రాసే శ్యామసుందరానికి వీడిని అప్పగించాం. దగ్గర కూర్చొని పసందైన ఉత్తరం రాయించాడు శ్యామసుందరం. అది పూర్తయ్యాక కేవలం ఆ అమ్మాయికే రాస్తే బాగుండదేమో, మామగారికి కూడా రాసి ఆ కవర్లోనే పెడతాను అన్నాట్ట సుబ్రావ్. 'వెరిగుడ్ ఐడియా...' అభినందించాడుట శ్యామసుందరం. "ఎలా రాయాలో చెప్పండి" అన్న సుబ్బారావుతో "మామగారికేగా-ఎలా రాసినా పర్వాలేదు. మోడల్‌కి కావాలంటే ఇదుగో నేను మా బావమరిదికి రాసిన ఉత్తరం. చూసుకుని రాసెయ్" అని చెప్పి ఏదో పనిమీద వెళ్ళాడుట శ్యామసుందరం. ఉత్తరం రాసేశాడు సుబ్బారావు. బావగారికి అని ఉన్న చోట మామగారికి అని మారుస్తూ చేతనైనంతలో బాగానే రాసి చివర్లో గంగా భాగీరథీ సమానురాలగు అత్తగారికి నా నమస్కారములు అని రాశాడుట. పోస్టు చేశాడు. అది అందీ అందగానే ఆ మామగారు ఉన్నపాటున ఆ ఉత్తరం పుచ్చుకుని బస్సెక్కి వీళ్ళ ఇంటికి వచ్చి వీళ్ళ నాన్నగారికి ఆ ఉత్తరం చూపించి 'ఏమిటీ, బాబూ! ఈ అన్యాయం? మా వాడు మంచి తెలివిగలవాడు, మర్యాదస్తుడు అని



జననం-1953. శ్రీవారి ఉద్యోగరీత్యా చిత్తరంజన్‌లో ఉంటున్నాం. ఆయన రైల్వేలో ఇంజనీర్. ఇద్దరు పిల్లలు-శిరీష, ప్రవీణ్. సరదాగా ఉండే రచనలంటే ఇష్టం. ఇంతవరకు ఒక నవల రాశాను-'ప్రేమలేఖ'. అదే 'శ్రీవారికి ప్రేమలేఖ' సినిమాగా వచ్చింది. 'జయంతి' కలం పేరుతో ప్రభలో కథలు వచ్చాయి.

బహుమతి ఇచ్చి ప్రోత్సహించిన ఆంధ్రప్రభ వారికి కృతజ్ఞతలు. పాఠకులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

-శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి

గొప్పగా చెప్పేరు-ఇదేనటండీ మర్యాద? నేను బ్రతికుండగానే నా భార్యను గంగా భాగీరథీ సమానురాలిని చేస్తాడా? ఎంత ధైర్యం?' అని నానా మాటలూ మాట్లాడి 'ఇలాటి తింగర వాడికి నా పిల్ల నివ్వను' అని చెప్పి వెళ్ళిపోయాట్ట. వాళ్ళ నాన్నగారు బస్సెక్కి వీడి దగ్గరికి వచ్చి వీడిని ఛెడామడా తిట్టిపోశారు. నోరుమూసుకుని కూర్చోక ఉత్తరాలు ఎవడ్రా రాయమన్నది నిన్ను? అని తిట్టి వెళ్ళిపోయేరు.

బుర్ర వంచుకుని కూర్చున్న సుబ్బారావుని చూస్తే జాలేసింది మాకు! 'ఎందుకు రాశావలా?" అని అడిగాం. "శ్యామసుందరం అలాగే రాశాడుగా మరి!" అన్నాడు అమాయకంగా. "వాడికి మామగారు లేరు కాబట్టి వాడలా రాశాడు. నీ మామగారు దుక్కలా ఉన్నారుగా! నువ్వెందుకు రాశావ్?" అని మందలించాం. పోన్లే. గతం నాస్తి. ఆ సంబంధం పోతే ఇక పెళ్ళేకాదా నీకు? అని ఓదార్చాం. ఆ తరువాత సంబంధాలు చూస్తూనే ఉన్నారు గానీ, ఏడాది దాకా కుదర్లేదు. వాళ్ళకి నచ్చితే వీళ్ళకి నచ్చకా. వీళ్ళకి నచ్చితే వాళ్ళకి నచ్చకా బెడిసిపోయాయి. చివరికి మంచి సంబంధమే కుదిరింది. ముహూర్తం పెట్టుకున్నారు. పెళ్ళి పల్లెటూర్లో. ఈసారి ఉత్తరాలూ పాడూ రాయలేదు. "అవన్నీ వద్దులేరా. ఏదో ఆ మూడు ముళ్ళూ పడి నే నో ఇంటివాడినైతే అంతే చాలు"



అన్నాడు దీనంగా. "నీ మొహంలే. బ్రహ్మాండంగా పెళ్ళి చేయించేస్తాం. అంతేకాదు-బ్రహ్మాండంగా రిసెప్షన్ కూడా ఇద్దాం" అని ధైర్యం చెప్పాం. వాడి మొహం వికసించింది.

పెళ్ళి రోజు దగ్గర పడుతున్న కొద్దీ వాడి బాధ వర్ణనాతీతం. ఉండుండి మనిషి మలేరియా పేషంటులా వణకిపోయేవాడు. అర్ధరాత్రి కయ్యిమంటూ లేచి కూర్చునేవాడు. కాలేజీలో క్లాసు తీసుకుంటూ హఠాత్తుగా ఆగిపోయి గుక్క నీళ్ళు కుక్కుకునేవాడు. వాడి వాలకం చూస్తే మాకు భయం వేసింది. తీరా చేసి పెళ్ళినాటికి వీడికి పిచ్చిగానీ ఎక్కదుకదా అని బెదిరిపోయాం. కనిపించిన వాడినల్లా కావలించుకుని ఏ ఆటంకమూ లేకుండా ఈ పెళ్ళి జరిగిపోతే బాగుండురా అని దుఃఖపడేవాడు. ఎవరికి తోచిన ధైర్యం వాళ్ళం చెప్తూ వాడిని క్షణం వదలకుండా కాపాడుకుంటూ కాలక్షేపం చేశాం. పెళ్ళి రోజు దగ్గరపడింది. మావాడి మొహంలో పెళ్ళి కళ బదులు ప్రేత కళ తాండవించసాగింది. శుభలేఖలు పంచారు. బంధువు లొచ్చారు. పందిళ్ళు వేశారు. స్నాతకం అయింది. మొత్తానికి ఏ ఆటంకమూ లేకుండా పెళ్ళికి బయలుదేరాం. వాళ్ళ ఊరు చేరాం.

పెళ్ళివారి ఏర్పాట్లు చెప్పుకోతగినంత గొప్పగా లేవు. పల్లెటూరు కదా! సౌకర్యాలు తక్కువ అనుకున్నాం. తెల్లవారుజామున నాలుగింటికి ముహూర్తం. మాసుబ్బారావు చుట్టూ చేరాం మేమందరం. "కాసేపు పడుకోరా-మళ్ళీ రేపంతా నిద్దరుండదు" అని ఎంత బ్రతిమాలినా క్షణం కూడా కన్ను మూసుకోలేదు వాడు. "మా అమ్మమ్మ ఎలా ఉంది? మా నాయనమ్మ బాగా తిరుగుతోందా? తాతగారు బాగున్నారుగా! ప్రయాణం బడలిక చెయ్యలేదుగా! వాన వచ్చేలా లేదులే! చచ్చేంత వేడిగా ఉంది. ఖర్మ...ఎటునించైనా కొంపలంటుకోవుగదా! వంటవాళ్ళు పొయ్యిలు సరిగా ఆర్పేశారో లేదో! ఏమిటో ఖర్మ! హరి భగవంతుడా. నీవే దిక్కు...నీదే భారం" అంటూ వణకిపోతూ కూర్చున్నాడు. "ఏవిటా పిచ్చి ప్రేలాపన! పిచ్చిగా వాగేవంటే తంతానొరేయ్. నోరు మూసుకుని కూర్చో" అని కసిరాం.

అతి కష్టంమీద రాత్రి గడిచింది. మంగళవాద్యాలు మ్రోగాయి. గడగడ వణకిపోతున్న పెళ్ళికుమారుడికి మంగళస్నానం చేయించి పెళ్ళి పీటల మీద కూర్చో బెట్టారు. ఎంతో అందంగా చూడడానికి రెండు కళ్ళూ చాలవు అన్నట్లు ఉన్నాడు. మీరందరూ కాస్త నా దగ్గరగా ఉండండిరా అని వాడు రిక్వెస్టు చెయ్యటం వల్ల అందరం వాడి వెనకగా నిలబడ్డాం. పెళ్ళి కుమార్తెని తీసుకొచ్చారు. ఆవిడకూడా చాలా అందంగా ఉంది. మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా ఉన్నారు. తెర అడ్డు పెట్టారు. ఆవిడ మధ్య మధ్య ఓరకంట వీడిని చూడడానికి ప్రయత్నిస్తూ ఉంటే, వీడుమాత్రం తల భూమిలోకి వంచేసుకుని కూర్చున్నాడు. "ఒరేయ్! మరీ అంత బెదిరిపోకు. కాస్త ఫ్రీగా ఉండు" అని చెప్పాను చెవిలో. పేలవంగా నవ్వాడు. "పెళ్ళికూతురు ఎంత బాగుందో-ఓ సారి తలెత్తి చూడు" అన్నాను ప్రోత్సహిస్తూ. "ఏదో లేరా దేవుడి దయవల్ల ఏ ఆటంకమూ లేకుండా పెళ్ళి జరిగిపోతే" అన్నాడు నీరసంగా. "ఛ! అపశకున పక్షి. జరిగిపోతే ఏమిటీ జరిగిపోతుంటే!" అన్నాను. కన్యాదానం జరుగుతూ ఉంది. కాళ్ళు కడిగారు. అమ్మాయి చేతిలో కొబ్బరి బొండం ఉంచి వీడి చేతిలో ఉంచారు. "కన్యాం కనక సంపన్నాం" అంటూ గొంతెత్తి మంత్రాలు చదువుతున్నారు ఇరువైపుల పురోహితులూ. అంతలో బయటినించీ కేక వినిపించింది-"టెలిగ్రాం! ఎస్. సుబ్బారావు గారికి టెలిగ్రాం" అంటూ. అంతే! కెవ్వున కేకవేసి తయ్యమని గాల్లోకి ఎగిరాడు సుబ్బారావు. రెండడుగులు గాల్లోకి లేచి దభీమని మామగారి ఒళ్ళో పడ్డాడు. ఆ విసురుకి ఆ మామగారు పక్కనున్న కూతురి మీదికి ఒరిగిపోయారు. ఆ పెళ్ళికూతురు తల్లిని తోడు తీసుకుని మండపం పక్కన అలంకారంగా పెట్టిన అరటి స్తంభాన్ని విరగ్గొడుతూ కింద పడిపోయింది. పెళ్ళికూతురి చేతిలోని కొబ్బరి బొండం గాల్లోకి లేచి పెళ్ళికూతురి వైపు పురోహితుడి మొహాన ఫెడీమంటూ తగలడంతో ఆయన మొహం అదిరిపోయి వెనక్కు తూలి మండపం పక్కనున్న నీళ్ళ బిందెలో తల్లక్రిందులుగా లేండయిపోయాడు. క్షణంలో అంతా గందరగోళం అయిపోయింది. భజంత్రీలవాళ్ళు వాయించడం మానేశారు. అందరూ మండపం చుట్టూ చేరారు. తెల్లబోయిన మేమందరం తెలివి తెచ్చుకుని చకచకా రక్షణ కార్యక్రమాన్ని చేపట్టాం. మంటపం మీదికి ఎక్కి మామగారిని కావలించుకుని వణకిపోతున్న సుబ్బారావు వీపుమీద ఒక్కటి వేసి వాడి చేతుల్లోంచి ఆయన్ని విడిపించాను నేను. మండపం పక్కన పడిపోయిన అరటి స్తంభాన్ని లేపి నిలబెట్టాడు మాపట్టాభి. మొహం బిందెలో పెట్టి శీర్షాసనం వేసి కాళ్ళు ఆడిస్తున్న పురోహితుడిని నడుం పట్టుకుని లేపి నిలబెట్టి, ఆయన తలమీది నించి బిందె తొలగించారు మా రాంబాబు. శ్యామసుందరం. ఈలోపుగా నలుగురూ చేరి అసలు ఏమయింది. ఏమయింది అని ఆరాలు మొదలుపెట్టారు. నాకూ డౌట్ వచ్చి సుబ్బారావు దగ్గరికి వెళ్ళి ఏమిట్రా-ఎందుకలా ఎగిరావ్ అని అడిగాను. వెంటనే నన్ను కావలించుకుని "అయిపోయింది- టెలిగ్రాం వచ్చింది" అన్నాడు. దాదాపు ఫెయింట్ అయిపోతూ. నాకు ఒళ్ళు మండిపోయింది. "ఛ! నోర్మూయ్. వెధవా! మరీ నన్నా సిలా తయారవుతున్నావ్" అని నాలుగు తిట్టి పీటల మీద కూర్చోబెట్టాను. ఎవరో వెళ్ళి ఆ టెలిగ్రాం అందుకున్నారు. అది గ్రీటింగ్ టెలిగ్రాం. మేమెంత గునగునలాడుకున్నా పెళ్ళికొడుకు టెలిగ్రాం అనగానే భయపడి డాన్సు మొదలుపెట్టాడని అక్కడ చేరిన అందరికీ తెలిసిపోయింది.

పెద్దలు అందరూ పూనుకుని ఆ- కానీయండి ముహూర్తం మించిపోతోంది అని తొందర పెట్టేశారు. ఆడంగులంతా మండపంమీదికి వచ్చి పడిపోయినవి అన్నీ ఎత్తేసి వేటి స్థానాలలో వాటిని అమర్చారు. క్షతగాత్రు లందరికీ కాఫీ లిచ్చి మళ్ళీ కూర్చోబెట్టారు. ముక్కూ నోటా నీళ్ళు కొట్టుకున్న ఆ పురోహితుడుమాత్రం అడ్రసు లేకుండా ఎటో పోయాడు. కాబట్టి మంత్రాలు చదివే బాధ్యత మొత్తం ఆ రెండో పురోహితుడి మీద పడింది. అసలే బెదిరిపోయి ఉన్నాడు మనిషి. తన కొలీగ్‌కి పట్టిన దురవస్థ తలుచుకుని అదిరిపోతూ, పెళ్ళికొడుకుని ఎక్కువ ఇబ్బంది పెట్టకుండా తడబడిపోతూ కన్యాదానం సమర్పయామి. మంగళసూత్రం సమర్పయామి. స్థాలీపాకం సమర్పయామి. నాగవల్లి సమర్పయామి అంటూ చకచకా అయిదు నిముషాల్లో పెళ్ళి ముగించిపారేశాడు.

అటు పెళ్ళి జరుగుతుండగానే మా దగ్గరికి వచ్చాడు పెళ్ళివారి తరఫు మనిషి ఎవరో. "చూడండి-పెళ్ళికొడుకు టెలిగ్రాం అనగానే అలా ఎగిరాడేం?" అని ఆరా తీశాడు. "ఏముందీ-మా వాడికి టెలిగ్రాం పేరెత్తితే భయం" అని చెప్పేశాం. ఆయన అంత తేలిగ్గా వదల్లేదు. "టెలిగ్రాం అంటే భయం. అందులోనూ అలా అదిరిపడే భయం ఉండటం ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు అనుమానంగా. లోలోపల మాకూ మొహమాటంగా ఉన్నా, పైకిమాత్రం బింకంగా "బావుంది. ఆశ్చర్యం ఏముంది? కొందరికి బల్లిని చూస్తే భయం. మరి కొందరికి పిల్లిని చూస్తే భయం. ఇక టెలిగ్రాం విషయం అంటారా? వాడిని చూసే మీరిలా బెదిరిపోతున్నారు. మా చిన్నతనంలో మా ఇంగ్లీషు మాస్టారు తంజావూరు శ్రీనివాసన్ వెంకట్రామయ్యర్‌గారు క్లాసులో పాఠం చెప్తూఉండగా టెలిగ్రాం వస్తే వణకిపోయి మురుహా. మురుహా



అంటూ ప్రాణాలొదిలేశారు" అని అడ్డంగా దబాయించేశాం.

పెళ్ళిభోజనాలు అయ్యాయి. మే మందరం వెళ్ళి మాసుబ్బారావు దగ్గర కూర్చున్నాం. "ఏమిత్రా, అబ్బాయ్! ఏం చేస్తున్నావ్?" అని పలకరించాం. "ఏదో ఇలా ఉన్నాను. మొత్తానికి ఎలాగైతేనేం, నా పెళ్ళయిపోయింది" అన్నాడు ఆనందబాష్పాలతో. "మెల్లిగా అంటావేం? బ్రహ్మాండంగా జరిగిపోతేనూ!" అన్నాం. ఆనందపడ్డాడు. కబుర్లు మొదలుపెట్టాం. క్రమంగా వాడి మొహంలో ఆ భీతి లక్షణాలు పోయి జీవం చోటు చేసుకుంది. "ఒరేయ్ పునారే! పొద్దున్న నేను చేసిన రభస చూసి పెళ్ళికూతురు ఏమనుకుందో!" అన్నాడు సందేహంగా. మొహమొహాలు చూసుకున్నాం మేము. ఆ అనుమానం వాడికే కాదు, నాకూ వచ్చింది. ఆ సంఘటన తరువాత ఆవిడ వీడివంక అదోలా చూడడం గమనించాను నేను. మేము సమాధానం చెప్పకపోవటంతో వాడి మొహం మళ్ళీ కళ తప్పింది. "నేను వెర్రి నన్నాసి ననుకుందో ఏమిటో కొంపదీసి!" అన్నాడు భయంగా. "ఖచ్చితంగా అనుకొనే ఉంటుంది. అయినా, నాకు తెలీకడుగుతాను, సుబ్బిగా! టెలిగ్రాం అనేసరికి అలా ఎగిరెయ్యటమేనా! బుద్ధి లేపోతే సరి!" అన్నాడు ఏ విషయం అయినా మొహాన అనేసే పట్టాభి. "నా బాధ మీకేం తెలుసురా? నా పొజిషన్‌లో ఉంటే మీరు అంతకన్నా ఎక్కువ హంగామా చేసేవాళ్ళు. ఇంతకీ ఏమిటో? ఆ అమ్మాయికి నామీద బాడ్ ఇంప్రెషన్ కలిగి ఉంటుందంటారా?" అన్నాడు దాదాపు ఏడ్చేస్తూ.

నాకు భలే జాలివేసింది.

"చాల్లే ఊరుకో. ఈ కాస్త దానికే నువ్వు చవట వెధవ్వని డిసైడ్ చేసేసుకోడానికి ఆవిడేం తెలివి తక్కువదా! ఇకముందు ఎలాగూ మామూలుగా ఉంటావుకదా!" అని ధైర్యం చెప్పాను. "కరెక్ట్. జరిగింది ఏదో జరిగిపోయింది. ఇకముందు జాగ్రత్తగా ఉండు. ఈ రాత్రికి బ్రహ్మాండంగా బిహేవ్ చేసి చూడు-ఆవిడ ఇంప్రెస్ అయిపోతుంది" అన్నాడు శ్యామసుందర్ నన్ను బలపరుస్తూ.

దాంతో రాంబాబుకి హుషారొచ్చేసింది. "అవున్రా, సుబ్రావ్. నేను చెప్పినట్లు చెయ్యి. కవిత్వం పొంగి పొరలేలా మాట్లాడు. ఆవిడ అందాన్ని పొగుడు-నీ లాటి భార్య లభించడం నా అదృష్టం అను. ఏ మాట మాట్లాడినా రసికత్వం ఒలికిస్తూ మాట్లాడు. ఆవిడ ఐస్ అయిపోతుంది. ఇక చెప్పేదేముంది? నీ జీవితం మూడు పూలు, ఆరు కాయలుగా సాగిపోతుంది" అన్నాడు ఆవేశంగా. ఆశగా విన్నాడు సుబ్బారావు. ఇంకా ఏమిటో చాలా చెప్పాడు రాంబాబు.

రాత్రి భోజనాలయాక నూతన దంపతులని మేడమీద గదిలోకి పంపించారు. గడగడ వణకిపోతున్న వాడికి ధైర్యం చెప్పి పంపించాం. అయిదు నిముషాలు కాకుండానే ధనామని తలుపులు తీసుకుని విసురుగా వచ్చేసింది పెళ్ళికూతురు. మళ్ళీ కలకలం చెలరేగింది. ఇతరులద్వారా మాకు తెలిసింది ఏమిటంటే-"ఇక ఆ మనిషితో కాపురం చెయ్యను" అని కుండ బద్దలు కొట్టి చెప్పేసిందిట ఆవిడ. ఉస్సురని నిట్టూర్చారు వాడి బంధువులు. ఈ నష్ట జాతకుడికి పెళ్ళి చెయ్యాలనుకోవడం మనదే బుద్ధితక్కువ అనుకున్నారు.


ఇక క్షణం ఆలస్యం చెయ్యకుండా గదిలోకి పరిగెట్టాం. శూన్యంలోకి చూస్తూ కూర్చున్న సుబ్బారావు మమ్మల్ని చూడగానే మండిపడుతూ రాంబాబు కాలరు పుచ్చుకున్నాడు. "ఇడియట్! నీ సలహా పాటించి ఇలా అన్యాయం అయిపోయాను-కవిత్వం చెప్పు, ఐస్ అయిపోతుంది అన్నావు. చెప్పేను. ఐస్ అవలేదు సరికదా, ఫైర్ అయిపోయింది" అన్నాడు విసురుగా.

వాడిని విడిపించి "అసలేమైందిరా? ఏం కవిత్వం చెప్పావు?" అన్నాను. లోపలికి రాగానే ముందు ఆవిడే పలకరించిందిట. వెంటనే "గీతా! నువ్వు దొరకటం నా రాత!" అన్నాడుట వీడు. "ఓరి నీ మొహం మండ! అదేం కవిత్వంరా?" అన్నాడు రాంబాబు నిస్సహాయంగా. "తర్వాతేమైంది?" అడిగాడు పట్టాభి. "ఏముంది? నన్ను కోపంగా చూసింది. నాకు భయంవేసి నా జీవితం ఒక బండి. దానికి నువ్వే దున్నపోతువి అని కవిత్వం చెప్పేను" అన్నాడు. "ఓరి నిన్ను తగలెయ్య! నేను చెప్పిందేమిటి? నువ్వు చేసిందేమిటి? 'నా జీవిత శకటానికి సారథివి నువ్వు' అనరా అంటే బళ్ళూ దున్నపోతులూ ఏమిట్రా ఖర్మ" అని నెత్తి బాదుకున్నాడు రాంబాబు. "ఏదో చట్టుబండలూ. అసలే కాళ్ళొణికి, నోరెండి నే నేడుస్తుంటే... అవన్నీ గుర్తొచ్చి ఏడవలేదు. అయినా నాకు తెలీకడుగుతాను. శకటం అంటే ఏం? బండి అంటే ఏం?" అన్నాడు. "శకటానికీ బండికీ తేడా లేకపోవచ్చు కానీ. సారథికీ దున్నపోతుకీ కావలసినంత తేడా ఉంది" అన్నాడు రాంబాబు చిరాగ్గా.

"సరే. ఆ తరువాత ఏమైంది?" అడిగాను నేను. "ఇక అయ్యేందుకు ఏముంది? శోభనం నాడే నన్ను దున్నపోతు అంటారా? ఇక జన్మలో మీ మొహం చూడను అనేసి వెళ్ళిపోయింది" అంటూ ఏడ్చినంత పని చేశాడు వాడు. మావాళ్ళంతా వాడిని తిట్టిపొయ్యడం మొదలు పెట్టారు.

నేనుమాత్రం ఇవతలికొచ్చేశాను. తిన్నగా పెళ్ళికూతురి దగ్గరకు వెళ్ళాను. నన్ను పరిచయం చేసుకుని, వాడి గతం అంతా చెప్పేను. "చూడమ్మా ... మాసుబ్బారావు నువ్వనుకున్నట్లు వెర్రివాడుగనీ, పొగరుబోతుగానీ కాడు. అతి మంచివాడు. నిజం చెప్పాలంటే వాడిని భర్తగా పొందటం నీ అదృష్టం. నేను చెప్పాల్సింది చెప్పాను. నీ నిర్ణయం మీద వాడి భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఏం నిర్ణయించుకుంటావో నీ ఇష్టం" అని ఆవిడకి ఆలోచించుకునే అవకాశం ఇచ్చి నేను ఇవతలికి వచ్చేశాను. పాపం! సుబ్బారావుకి చివరికి పెళ్ళిలో కూడా ఇలా జరగటం నా మనసు కెంతో బాధ కలిగించింది. అంతా సవ్యంగా జరిగితే, ఆవిడ మనసు మార్చుకుని మా వాడిని కనికరిస్తే మా ఊరు వెళ్ళగానే గ్రాండ్‌గా రిసెప్షన్ ఇవ్వాలి అనుకున్నాను మనఃస్ఫూర్తిగా. ఇక అక్కడే గతి పట్టనుందో! ★

## డుంబు




## బుజ్జాయి

